◆ కథానిక

# ఓ ఇంటి కథ!

**గంగాధరం గారి రెండవ కుమార్తె వెంకట సీతామహాలక్ష్మికి ఆరోజు పెళ్ళి చూపులు! అప్పటికి ఆరు సార్లు పెళ్ళిచూపులు జరగటం అయిపోయింది. ఇది ఏడోసారి.**

ప్రతిసారి యధావిధిగా కాఫీలు-టిఫెన్లు-పళ్ళు-ఒక్కోసారి కూలుడ్రింకులు-వగైరాలన్నీ సమర్పించటం-వినయ విధేయతలతో-సాగనంపటం-గంగాధరం గార్కి ఆయన సహధర్మచారిణి అన్నపూర్ణమ్మ గార్కి మామూలె! అలాగే పెళ్ళిచూపులకి వచ్చిన ఆ పెద్దలు అడగదగ్గవి, అడగకూడనివి కూడా అవసరాలని మించి అవకాశాన్ని జారవిడుచుకోకుండా అమ్మాయిని అనేక ప్రశ్నలతో నిలదీసి చివరికి వెళ్ళేముందు ఇంటికి వెళ్ళేక ఉత్తరం రాస్తామని ఊరించి ఆటోలు పిలవమని పురమాయించి టా టాలు చెప్పి చక్కాపోవటం...అలవాటే!.

గంగాధరం గారు ఏడోసారికూడా ఆ అలవాటైన పద్ధతిలోనే పెళ్ళిచూపుల ఏర్పాట్లకి సిద్ధంకాబోతున్నారు.

నిజానికి గంగాధరం గార్కి లోలోపల ఎంత బాధగావున్నా బంధువులంతా బోధిస్తూవుండటం, చుట్టూ జరుగుతున్న వ్యవహారాలన్నీ చూస్తూండటం వల్ల పెద్ద కుమార్తె కృష్ణవేణి పెళ్ళి ఎలాచేసారో బాగా అనుభవంల్లో వుండటం వల్ల లోపలి బాధవంతా గరళకంఠు డిలా దాచేసుకుని చిరునవ్వుతో పెళ్ళిచూపుల తతంగం సిద్ధం చేయిస్తూ వుంటారు.

ఆడపిల్లని కన్నవాడే గుండె దిటవు సహనం అలవరుచుకోవాలని తన పెద్దలంతా హితవులు చెవ్తూ వచ్చారు. అందులోనూ ఒక్క ఆడపిల్లకాదు! ముగ్గురు ఆడపిల్లలు!! ఆఖరుగా పుట్టేడు మగపిల్లాడు! ఇంకా హైస్కూలు చదువైనా పూర్తికాలేదు వాడికి. ఇకవాడి ఆసరా ఏముంటుంది?

కానీ చుట్టపక్కాలు మాత్రం గంగాధరం గార్కి ఏమిటీ? రాజాలాంటి కొడుకు! ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేసి గట్టెక్కేరంటే... ఇక అంతా సుఖమే! పెట్టిన ఖర్చంతా రెట్టింపు లాభంతో కొడుకు పెళ్ళిలో తీసేసుకుంటారు!... అంటూ మరో పదహేనేళ్ళ తర్వాత జరిగే అదృష్టాన్ని అరిచేతిలో చూపించేస్తూ ప్రస్తుతం పడే అవస్థని అవలీలగా దాటేయమని సలహాలిస్తూ వుంటారు.

ఏది ఏమైనా గంగాధరంగారు మాత్రం రెండవ కూతురు పెళ్ళి ప్రయత్నాలు పట్టుదలగా సాగిస్తున్నమాట నిజం! అందుకే మధ్యవర్తి అయిన రామశాస్త్రి ఊరికెళ్ళినా...ఎవరో చెప్పిన 'ఫలానా' పెళ్ళికొడుకుని పెళ్ళిచూపులకి రమ్మని ఆహ్వానించివచ్చారు.



అయితే అబ్బాయి చెప్పినమాటవిని కొద్దిగా కలవరపడ్డారు. 'అమ్మాయిని నేను చూస్తే చాలు. నాకు వచ్చితే మా పెద్దలు అభ్యంతరపెట్టినా ఆగను' అన్నాడు.

'బొత్తిగా ఇలా అనేస్తున్నాడేమిటా?' అని సందేహించినా 'ఈ కాలం కుర్రాళ్ళకి కాస్త "కారం"పాలు ఎక్కువ. పెద్దాళ్ళకన్నా ముందు తను చూడాలన్న తొందర కాబోలు ఉత్తితొందర మనిషి అని సమాధానపడ్డారు. సమయానికి రామశాస్త్రికూడా లేదు.

వేదుల శకుంతల

సంప్రతించే సమయం లేదు. ఆ అబ్బాయి మళ్ళీ క్యాంపుకెళ్ళిపోతాట్ట! సరే కానీయ్ పెళ్ళిచూపులే కదా జరిగేది. వచ్చుతుందని నమ్మకమేమిటి?' అని కూడా తనకి తనే వచ్చచెప్పకున్నారు.

'చూడండి ఆర్భాటాలు, హడావిళ్ళు నాకంత నచ్చవు. సింపుల్‌గా మీ అమ్మాయితో రెండు మాటలు మాట్లాడుతాను. టీలు, టిఫెన్లు మర్యాదలు అంటూ భరతనాట్యాలు చేయ్యకండి.' అనే సరికి గంగాధరం గారు కనురెప్పలు చిట్లించి 'అబ్బాయేమిటి మరీ సినిమాడెలాగులు వదిలేస్తున్నాడు? బహుశా నాటకాల్లో వేసే అనుభవం ఏమైనావుంది కాబోలు! ఆ! ఇవన్నీ ముందుమాటలే! తీరా పిల్లనచ్చాక అప్పడు భీష్మించి అన్నీ కోరికలు తీర్చాలంటాడులా వుంది! అనుకున్నారు.

"సరే! నీ అభిమతం ప్రకారమే కానిస్తాం బాబూ!" అని చెప్పి ఇంటికి వచ్చి ఆ మర్నాటి పెళ్ళిచూపులకి ఆయత్తమయ్యారు.

అబ్బాయి ఎంత వద్దన్నా కాస్త ఇల్లు సర్దుకోవటం, టీ బిస్కెట్లులాంటి ఏర్పాట్లు చేసారు.

అనుకున్న టైమ్‌కి సరిగ్గా వచ్చాడు అబ్బాయి. చాలా సింపుల్‌గా! అంతకన్నా జెంటిల్మెన్‌గా అమ్మాయిని రెండు ప్రశ్నలు మాత్రం వేసేడు. ఆ తర్వాత మరింత సిన్సియర్‌గా "మీ అమ్మాయి నాకు వచ్చింది. మీ అమ్మాయికి కూడా నేను వచ్చితే మరింకే ఆలస్యం అక్కర్లేదు. మీరు పెట్టదల్చుకున్నవన్నీ మీ అమ్మాయికి పెట్టుకోండి అల్లుడిగా నాకేమి ఇవ్వనవసరంలేదు" అన్నాడు చిరునవ్వులుచిందిస్తూ!!

గంగాధరంగార్కి స్పృహ తప్పతున్నట్టు అనిపించి వెంటనే కుర్చీ చెయ్యి గట్టిగా పట్టుకుని నిలదొక్కుకున్నారు. అన్నపూర్ణమ్మగార్కి చెవుల్లో ఏదో హోరు వినిపించి తలువు ఆసరాగా పట్టుకున్నారు. వెంకట సీతామహాలక్ష్మికి కూర్చున్న కుర్చీ గాలిలో తేలిపోతున్నట్టు తోచి కాళ్ళతో నేలమీద గట్టిగా అదిమి పెట్టింది. వాళ్ళ పరిస్థితి ఇలా వుండగా-

"ఆ చూడండి! మరొక విషయం. పెళ్ళి ఎంత నిరాడంబరంగా జరిగితే అంత సంతోషిస్తాను. రిజిష్టర్ మ్యారేజి నాకు మరీ ఇష్టం! మా పెద్దలు ఒప్పకోకపోయినా నేను లెక్కచెయ్యను. ఎలాగో ఒప్పిస్తాను. అందుకని మీరు మా తల్లితండ్రులకి ముహూర్తాల గురించి తెలియచేయండి లేదా మీరు ఎలా చెయ్యాలనుకుంటున్నారో అదే చెప్పండి ఇదుగో మానాన్నగారి అడ్రస్" అంటూ జేబులోనుంచి ఓ కాగితం తీసి గంగాధరం గారికిచ్చి "వస్తాను మరి" అని లేచాడు.

గంగాధరంగారు ఆ అబ్బాయిని ఎలా సాగనంపేరో అన్నపూర్ణమ్మగారు ఎలా ఇంట్లోకి వెళ్ళగల్గేరో కాని సీతామహాలక్ష్మికి మాత్రం వెంటనే కుర్చీలోంచి లేచి పక్కనే వున్న సోఫాలో పడిపోయింది!

ఏడోసారి పెళ్ళిచూపులు ఆ విధంగా జరిగి ఇంచుమించు ఇంట్లో అందరి మతులు పోయినట్టైంది.

ఏం చేయాలో తోచక అయోమయావస్థలో వుండగానే ఉరవని పిడుగులా రామశాస్త్రి ఊర్నించి ఊడిపడ్డారు. ఏమండీ గంగాధరంగారు ఎక్కడున్నారూ? రండి! రండి! మీకో మాంచి వార్త! మీ వెంకట సీతామహాలక్ష్మికి ఓ చక్కని సంబంధం చూసేము. అందుకే నాకింకా రెండు రోజులు మా ఊళ్ళో పనులున్నా వదిలేసుకుని ఆఘమేఘాలమీద పరుగెట్టుకు వచ్చాను!" అంటూ రామశాస్త్రి గంగాధరం గారి ఇంట్లోకి అడుగుపెడుతూనే అదరగొట్టేసాడు.

గంగాధరం గారు మెల్లగా లోపల్నుంచి వచ్చి "కూర్చోండి శాస్త్రిగారూ నేనూ మీకో వార్త చెప్పాలి." అని శాస్త్రిగార్ని కూర్చోబెట్టి జరిగిన విషయం అంతా చెప్పేరు.

"ఆ!? ఏమిటండీ గంగాధరంగారూ! మీకేమైనా మతుందా? మరీ ఇంత తొందరటండీ? నేను రాకుండా ఎవడో జులాయిగాణ్ణి తీసుకువచ్చి అమ్మాయిని చూపిస్తారా?" అని ఎగిరిపడ్డాడు.

"జులాయిగాడా?" ఆశ్చర్యంగా చూసేరు గంగాధరంగారు.

"ఇంకా మెల్లగా అడుగుతున్నారా? ఆ కుర్రాడు వాళ్ళమ్మానాన్నలు అసలు చూడక్కర్లేదన్నాడా? కట్నం కానుకలు అసలే అక్కర్లేదన్నాడా? పైగా రిజిష్టర్ మ్యారేజ్ మరీ మంచిదన్నాడా? అయ్యో! అయ్యో! ఇంతకన్నా విపరీతం మోసం, ఇంకేమిటి? జులాయి వెధవ కనుకనే పెళ్ళి ఎంతతొందరగా చేస్తే అంత మంచిదన్నాడు. ఆ అడ్రసు కూడా ఎంత అబద్ధమో? ఎవరిది ఇచ్చాడో? అమ్మో ఎంత మోసం? ఎంత మోసం? గంగాధరంగారూ మీ వంశం ఎలాంటిదండీ? నిప్పుగదండీ! నిప్పు!వివాహం అంటే ఎలా జరగాలి? పెద్దమ్మాయి పెళ్ళి ఎలా జరిపించారూ? ఎన్ని లాంఛనాలు...ఎన్ని వేడుకలు...ఎన్నితంతులు?! ఎంత దివ్యంగా చేసేరు? వివాహం అంటే అందరి ఆశీస్సులతో వెయ్యేళ్ళు వర్ధిల్లాలండి ఆ దంపతులు!

"ఇదిగో చూడండి గంగాధరంగారూ! ఇదేదో మోసమే! వాడొక కేడీగాడైవుంటాడు. లేదా జులాయి తిరుగుళ్ళు రేసుకోర్సులు గట్రా ఉన్నాయేమో? అమాయకులని మిమ్మల్ని మోసంచేసి నిక్షేపంలాంటి పిల్ల గొంతు కోద్దామనుకుంటున్నాడు. పదండి వాడి అంతుతేలుద్దాం" అంటూ కండువా దులిపి భుజంపైన వేసుకుని అపరచాణుక్యుడిలా బయల్దేరబోతున్న రామశాస్త్రిగార్ని ఆపి...ఎందుకు రభస? అతను క్యాంపుకెళ్ళి వుంటాడు. రాగానే మా అమ్మాయికి నచ్చలేదు, మాకీ పెళ్ళి ఇష్టంలేదని చెప్పేస్తాము." అన్నారు గంగాధరంగారు.

"అద్దదీ! అదీ పెద్దమనిషి తరహా అంటే! అయినా వాడిచ్చిన అడ్రస్సు ఇలా ఇవ్వండి. అసలు వాళ్ళెవరో ఏమిటో ఆరాతీద్దాం!" అంటూ గంగాధరం గారు వద్దన్నా వినకుండా బలవంతంగా ఆ అడ్రసు తీసుకుని-గొడవ ఏంచేయనులెండి! ఊరికే తెలుసుకుంటానంతే అంటూ హామీ ఇచ్చి-ఏమైనాసరే-మీ సీతాలక్ష్మికి నెలతిరక్కుండా బ్రహ్మాండంగా పెళ్ళి జరిపించకపోతే చూడండి!" అనేసి లేచి వెళ్ళిపోయాడు రామశాస్త్రి!

"నేను అప్పుడే అనుకున్నాను ఇదేదో గమ్మత్తుగా వుందే అని" అన్నపూర్ణమ్మగారి మాటలు పూర్తి కాకముందే- "పోనీలే అంతా మనమంచికే"-అని తేల్చేరు గంగాధరంగారు.

సీతామాలక్ష్మికి-ఆ అబ్బాయి రూపం కళ్ళల్లో మెదిలి-ఇది మోసం కాకుండావుంటే ఎంత బాగుండేది-ఆ మంచి, ఆ వినయం అంతా దగాయేనా-అనిపించి నిట్టూర్చుకుంది.

* నిజంగా నెల తిరక్కుండానే వెంకట సీతామహాలక్ష్మికి పెళ్ళి అయింది! ధూం ధాంగా జరిగింది. యాభై వేలు కట్నం- పట్టుబట్టలు-వెండికంచం-. చెంబు-ఉంగరం కాక అప్పగింతల బట్టలు-ఆడబడుచు లాంఛనాలు-అత్తగారి లాంఛనాలు- వెరసి అరవై వేలు దాటింది!

ముప్పై వేలు చిట్‌ఫండ్‌లో నుంచి-పన్నెండు వేలు ప్రావిడెంట్ ఫండ్‌లో నుంచి-తీసుకుని-మిగతా డబ్బు-బంధువుల దగ్గర మిత్రుల దగ్గర అప్పచేసి-ఘనంగా పెళ్ళి చేసేరు.

'ఎంతైనా గంగాధరం చెయ్యిగొప్పది! ఇద్దరాడపిల్లల పెళ్ళిళ్ళు ఘనంగానే చేసేరు...' అని చుట్టాలు మెచ్చుకున్నారు. సంతృప్తిగా గాలి పీల్చుకున్నారు... గంగాధరంగారు, అన్నపూర్ణమ్మగారు...

సరే! అంతా బాగానేవుంది-

ఇంతకీ పెళ్ళికొడుకు ఎవరు? ఆ జులాయి గాడే!? ఆ కేడీ గాడే!?

మరి కట్నం తీసుకోనన్నాడు గదా? అయినా వాడికి పిల్లని ఇవ్వనన్నారు గదా!?

అక్కడే వుంది మన సగటు తెలుగింటి కథ!

పెళ్ళికొడుకు రామ్‌ప్రసాద్-మంచి ఉద్యోగంలో వున్నాడు. అభ్యుదయ భావాలు జీర్ణించుకుని- ఆచరణలో సాధించాలనుకుని కలలు కంటూ ఆరేళ్ళ నుంచి-పెళ్ళంటే-ఆడపిల్ల తండ్రిని అప్పల పాలు చేయటం కాదని- ఆదర్శంగా వివాహం చేసుకుని అన్యోన్యంగా జీవితం సాగించాలని అతని ఆశ! ఆశయం! అని తల్లిదండ్రులతో చెప్తూనే వున్నాడు.

కానీ, తల్లిదండ్రులు ఒక్కొక్క-చెల్లి పెళ్ళి చెయ్యద్దా నీ పెళ్ళికి వచ్చే కట్నం...దాని పెళ్ళికి వర్దాలని అడ్డుపుల్లలు వేస్తు-అతని ఆదర్శాలని కొట్టిపారేస్తున్నారు. అందుకే రామ్‌ప్రసాద్-తల్లిదండ్రులకి చెప్పకుండా వేరే ఊరికి బదిలీ చేయించుకుని-తనే సంబంధాలు స్వయంగా చూసుకోవాలనుకున్నాడు-అలాగే చూసుకుంటున్నాడు!

కానీ-కట్నం వద్దు...పెద్దవాళ్ళు చూడక్కర్లేదు... అనే అతని అభ్యుదయాన్ని-అర్థం చేసుకోలేని ఆడపిల్లల తండ్రులు- వాడిలో ఏదో లోపం వుందనుకునేవారు. ఏ ఒక్క తండ్రినీ-మెప్పించలేని రామ్‌ప్రసాద్ నిరాశతో నీరుకారిపోయేడు. సీతామాలక్ష్మిని కూడా నచ్చలేదంటే-ఛీ! ఈ సగటు మనుష్యులింతే అనుకుని-"నాన్నా! నా పెళ్ళి నీఇష్ట ప్రకారమే కానివ్వు! నీకు కావలసినంత కట్నం అడుగు-ఫలానా వారి అమ్మాయి నాకు నచ్చింది నువ్వు అమ్మా వెళ్ళి చూడండి! -" అని అసలు సిసలైన పెళ్ళికొడుకులా తండ్రిని హెచ్చరించాడు-

'ఇన్నాళ్ళకు వీడికి జ్ఞానోదయమైంది' అన్నంతగా సంతోషించి తల్లి తండ్రి హోదాగా-సీతామహాలక్ష్మిని మరో సారి పెళ్ళి చూపుల్లో-యక్ష ప్రశ్నలు వేసి-ఫలహారాలు సేవించి-కట్న కానుకలు ప్రస్తావించుకుని ముహూర్తాలు పెట్టుకుని వచ్చారు.

ధూం ధాంగా పెళ్ళి జరిగింది! బంధులంతా మెచ్చుకున్నారు. రామశాస్త్రి-సగర్వంగా-చూశారా? గంగాధరం గారూ- నాతడాకా? వాళ్ళ ఆరా తీసి అబ్బాయి మెడలు వంచి మీ చేత కట్నం ఇప్పించేను-పెళ్ళా? మజాకా? అంటూ ఉత్తరీయం దులుపుకున్నాడు.

గంగాధరం గారు-అప్పల జాబితా చూసుకుంటూ-రిటైర్ అయ్యేలోపులో ఈ అప్పులు తీర్చి మూడో అమ్మాయి పెళ్ళి కూడా చేసెయ్యాలని అనుకుంటూ...

"అన్నట్టు దీపావళి పండుగకి అమ్మాయిని, అబ్బాయిని, వియ్యాల వారిని పిలవాలిగదా? పనిలో పనిగా పెద్దమ్మాయిని అల్లుణ్ణి రమ్మంటే బాగుంటుంది-" అని భార్యతో అన్నారు.

ఆవిడ" అంతకన్నానా? అప్పల్లో అప్పు కలిసిపోతుందని" సలహా ఇచ్చి సంతోషించింది!-సరిగ్గా అదే సమయంలో రామ్‌ప్రసాద్ తమకొత్త కాపరంలో-వెంకట సీతామహాలక్ష్మితో- "సీతా మనం పోనీ పండగకి వెళ్ళకుండా మనింట్లోనే చేసుకుందాం!" అన్నాడు రామ్‌ప్రసాద్.

"ఛ! అవేం మాటలండి? అపశకునంగా మాట్లాడ కండి! పెళ్ళైన మొదటి పండగకి అత్తారింటికి వెళ్ళనవకూడదు. అది అల్లుడిహక్కు-" అంది.

రామ్‌ప్రసాద్ మనసులో-'ఓరి అర్భకుడా...నువ్వు తెలుగింటి కథ మార్చలేవు నోరుమూసుకో! అనుకున్నాడు-!



భర్తని నిలదీసి అడిగింది నళిని.

గుండేలమీద చెయ్యేసుకుని చెప్పండి.

ఆఫీసులో పన్జేసే ఆ టక్కులాడి జాలీతో మీకు అక్రమసంబంధం వుందా లేదా?

ఓసి పిచ్చిమొద్దూ, మేమిద్దరం రహస్యంగా వివాహం కూడా చేసుకున్నాం. మాది అక్రమ సంబంధం ఎలా అవుతుంది.? కసురుకున్నాడు భర్త.

కొట్రగడ్డ వెంకట్రావు, పామర్రు.